క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ

మూసాపేట: మూసాపేటలోని పంచశీల పాఠశాలలో శనివారం 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మోతీనగర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కిడి శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ స్థానిక నాయకులతో కలిసి శనివారం సన్మానించారు. రానున్న రోజులో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతోందన్నారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ కూకట్‌పల్లి అధ్యక్షుడు ఎండీ సలీమొద్దీన్, మస్తాన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నవగ్రహ పూజలు

ఆల్విన్‌కాలనీ: శని త్రయోదశి సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం ఫేజ్ 2లోని మల్లికార్జున స్వామి ఆలయంలో నవగ్రహాలకు పూజలు, శని దేవునికి తైలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



ఓల్డ్ బోయిన్‌పల్లి: సమతానగర్(ఆర్బీఐ) కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 కేలండర్‌ను ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ శనివారం ఆవిష్కరించారు. కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతున్నామన్నారు. పలు కార్యక్రమాలను వివరించారు. అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: ఓయో రూమ్‌లో పేకాడుతున్న ఏడుగురిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సమతానగర్‌లోని ఎన్–గ్రాండ్ ఓయో రూమ్–501లో పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో పేకాడుతున్న జనార్దన్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, దాసరి కృష్ణారెడ్డి, గంగాధర్ జగన్, కొలన్ నర్సింహారెడ్డి, బేగరి రవిలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,78,160, ఏడు సెల్‌ఫోన్లు, నాలుగుసెట్ల కార్డ్సును స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: భిక్షాటన చేస్తూ జీవనం గడిపే ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ నాలుగవ ఫేజ్, ఏడవ ఫేజ్‌ల వద్ద రోడ్డు పక్కన భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం గెలాక్సీ వైన్స్ వద్ద ఫిట్స్‌తో కింద పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి అతడికి ప్రాథమిక చికిత్స అందించారు. అతను కోలుకోగానే అక్కడే వదిలిపెట్టారు. రాత్రి ఫోర్త్ ఫేజ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నిద్రించిన ఆ వ్యక్తి ఉదయానికి మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేపీహెచ్‌బీ పోలీసులు స్థానికంగా విచారించి అతను యాచకుడిగా గుర్తించారు. 30–35 సంవత్సరాల వయస్సు ఉన్న ఆ వ్యక్తి కుడి చేతిపై శ్రీత అనే పేరుతో పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. ఇతర వివరాల కోసం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం కేటాయించినా..

నిర్లక్ష్యమెందుకు?



హౌసింగ్ బోర్డులో పాఠశాల కోసం కేటాయించిన స్థలం



పాఠశాలకు కేటాయించిన స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

పాఠశాల ఏర్పాటుకు స్థలం కేటాయించిన హౌసింగ్ బోర్డు

- దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం ప్రారంభం
- స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులకు లేఖ రాసినా పట్టించుకోని వైనం
- సదరు స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ సంస్థ

కేపీహెచ్‌బీకాలనీ: మేడ్చల్ జిల్లా విద్యాధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ పాఠశాల పాలిట శాపంగా మారింది. వందల కోట్ల రూపాయలు విలువ చేసే రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భూమిని ఉచితంగా విద్యాశాఖకు బదలాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. సదరు స్థలాన్ని తీసుకోవాలని ఏకంగా మూడుసార్లు లేఖ రాసినప్పటికీ జిల్లా విద్యాధికారులు కనీసం స్పందించకపోవటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ పాఠశాల కోసం సుమారు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. హౌసింగ్ బోర్డు కాలనీ నడిబొడ్డున ఉన్న ఈ భూమికి బహిరంగ మార్కెట్‌లో గజం రెండు లక్షల రూపాయల ధర పలుకుతోంది. నిజానికి ఇట్టి స్థలాన్ని గృహ నిర్మాణ శాఖ వేలం ద్వారా పాఠశాల ఏర్పాటు చేసే వారికి అమ్ముకోవటం ద్వారా కోట్లు గడించే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలోఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సదరు స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించాలని పట్టుపట్టారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు హౌసింగ్ బోర్డు నుంచి లేఖ కూడా ఇప్పించారు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవ.. దాతల విరాళం

ఎమ్మెల్యే కృష్ణారావు చొరవతో సదరు స్థలంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోటి రూపాయలు, ఇతర దాతలు మరో కోటి రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలను స్వర్గీయ ఎన్టీర్ పేరుతో నిర్మించే విధంగా నిర్మాణ పనులను కూడా మొదలు పెట్టారు. నాటి విద్యాశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారిని కూడా పాఠశాల నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్నారు. పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని అధికారికంగా స్వాధీనం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూడుసార్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు లేఖ రాశారు. అయినప్పటికీ వారి నుంచి కనీస స్పందన కరువైంది. దీంతో హౌసింగ్ బోర్డు అధికారులు తిరిగి సదరు స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన పనులు

పాఠశాల నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టినప్పటికీ అధికారికంగా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి మంజూరు పత్రాలు లేకపోవడంతో దాతలు కూడా పనులను నిలిపివేశారు. విద్యాశాఖ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకొని అనుమతి పత్రాలు వచ్చాక పనులు ప్రారంభిస్తామని వారు పేర్కొంటున్నారు.

కలెక్టర్ కూడా స్పందించడం లేదు



పాఠశాల కోసం విలువైన భూమిని అప్పగిస్తామని లేఖలు రాసినా కలెక్టర్ కూడా స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రత్యక్షంగా వెళ్లి కలెక్టర్‌ను కలిసి హౌసింగ్ బోర్డులో పాఠశాల భూమిని, అల్లాపూర్‌లో సర్వే నెంబర్18లో పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరాను. పేద పిల్లలు చదువుకునేందుకు హౌసింగ్ బోర్డు కాలనీలో కార్పొరేట్ తరహా స్కూల్ నిర్మాణం చేసేందుకు దాతలు ముందుకు వచ్చినా అధికారులు ముందుకు రాకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుంది.
– మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే

స్థలాన్ని పరిరక్షించడం కోసమే బోర్డుల ఏర్పాటు

హౌసింగ్ బోర్డు లే ఔట్‌లో పాఠశాల నిర్మాణం కోసం వదిలిన 2.39 ఎకరాల భూమిని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వినతి మేరకు ప్రభుత్వ పాఠశాల కోసం ఇచ్చేందుకు అంగీకరించాం. స్థలాన్ని చట్ట బద్ధంగా బదలాయించేందుకు ముందుకు వచ్చి హ్యాండోవర్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు లేఖలను రాసినా వారు స్పందించడం లేదు. నిజానికి ఈ భూమిని పాఠశాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారికి హౌసింగ్ బోర్డు విక్రయించుకోవచ్చు. అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాల కోసం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఖాళీ స్థలాలను రక్షించుకోవడం కోసం బోర్డులను ఏర్పాటు చేశాం.
–కిరణ్ బాబు, హౌసింగ్ బోర్డు వెస్టర్న్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

‘డబుల్’ ఇళ్లకు మరమ్మతులు చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



డబుల్‌బెడ్ రూమ్ సముదాయంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: నిజాంపేట డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్ రూమ్‌ల వద్ద వర్షపు నీరు సెల్లార్‌లోకి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు, కరెంటు సమస్యలు ఉన్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం నిజాంపేటలోని డబుల్‌బెడ్ రూమ్‌లను నిజాంపేట్ కమిషనర్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు అందించిన ప్రాంతాల్లో మంచినీరు, కరెంటు సమస్య, డ్రైనేజీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించటంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు నివసిస్తున్న ఇళ్ల అద్దెలు చెల్లించలేకపోతున్నారని, ఇకనైనా అధికారులు త్వరగా సమస్యలను పరిష్కరించి నిరుపేదలకు ఇళ్లను అందించే విధంగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



భరత్‌నగర్ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం మండల పూజల సందర్భంగా స్వామి వారి కనకాభిషేకాన్ని వేలం పాట నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ రూ.2.52 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పూజారి విష్ణు నంబూద్రి, వెంకటేష్ గురుస్వామి, సత్తయ్య గురుస్వామి, కృపాకర్, సంతోష్, బాలు తదితరులు పాల్గొన్నారు. – మూసాపేట

పేదల పెన్నిధి పీజేఆర్‌కు ఘన నివాళి



మూసాపేటలో పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

పీజేఆర్ వర్ధంతి సందర్భంగా వివిధ డివిజన్‌లలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలేసి శనివారం నివాళి అర్పించారు. మూసాపేట వడ్డెర బస్తీ గూడ్స్ షెడ్ రోడ్డులోని పీజేఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణారావు పూలమాలేసి నివాళులర్పించారు. కార్మిక, పేద ప్రజల పక్షాన నిలబడి వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు జనార్దన్ రెడ్డి అని అన్నారు.
– జోన్‌బృందం



పాపిరెడ్డినగర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



పీజేఆర్ నగర్‌లోని విగ్రహం వద్ద .. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



మూసాపేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు



భాగ్యనగర్ కాలనీలోని విగ్రహం వద్ద ..బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు తదితరులు





రిక్షా పుల్లర్స్ కాలనీలో.. పీజేఆర్ ఫంక్షన్ హాలు వద్ద విగ్రహానికి పూలమాలలేసి ..



నివాళులర్పిస్తున్న శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

డివైడర్ పనుల్లో నాణ్యత పాటించాలి: పీఏసీ చైర్మన్ గాంధీ



డివైడర్ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: డివైడర్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ కమాన్ నుంచి చేపడుతున్న రోడ్డు డివైడర్ పనులను శనివారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు డివైడర్ నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ గోవర్ధన్, వర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, పురేందర్ రెడ్డి, చంద్రమోహన్ సాగర్, శివసాగర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పల్లకీ సేవలో ..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం జరిగిన అయ్యప్ప స్వామి ఊరేగింపు కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ గాంధీ పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి కృపాకర్, వాసిరెడ్డి బాలు, తూము నరేంద్రపటేల్, సత్తయ్య, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయాల హుండీలోని నాలుగు నెలల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. శివాలయం 2 లక్షల 51 వేల 973 రూపాయలు, చిత్తారమ్మ ఆలయం 1 లక్ష 38 వేల 565 రూపాయలు, రామాలయం లక్షా 1 వెయ్యి 198 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురంలో రూ.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ స్రవంతి, ఏఈ రాధాకృష్ణ, బస్తీ వాసులు గౌస్, అన్వర్, అఫ్జల్, బద్రిశంకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు

- 31 వరకు వేడుకలు..విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ



కూకట్‌పల్లి: ప్రతి సంవత్సరం ఏడాది చివరలో కనుల పండువగా జరిగే అయ్యప్ప ఆలయ ఉత్సవాలు కూకట్‌పల్లిలో శనివారం ప్రారంభమయ్యాయి. 33 సంవత్సరాల క్రితం దాదాపు రెండు ఎకరాల స్థలంలో ఏర్పడిన అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప భక్తులకు శబరి పీఠం తలపించేలా ఏర్పాట్లను చేశారు. ప్రతి సంవత్సరం 100 మందికి పైగా భక్తులకు వస్తువుల కల్పనతో పాటు 45 రోజుల పాటు అన్న సమారాధన ఏర్పాటు చేస్తారు. వడ్డేపల్లి నర్సింగ్‌రావుచే ఆలయం నిర్మించబడింది. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అయ్యప్పను దర్శించుకునే విధంగా ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప దర్శనానికి వచ్చేవారు సాయిబాబా ఆలయం, హనుమాన్ దేవాలయం, లక్ష్మీగణపతి తదితర దేవాలయాలను దర్శించుకోవచ్చు. అదే విధంగా ఈ నెల 31న శివాలయం నిర్మాణం కోసం కూడా ఏర్పాట్లు రూపుదిద్దుకుంటున్నాయి. వడ్డేపల్లి నర్సింగరావు దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు అయ్యప్పలకు సేవలు చేసిన అనంతరం ఆయన కుమారుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూడా ఆయన బాటలోనే కొనసాగుతున్నారు. ఈ సంవత్సరం కూడా 160 మంది అయ్యప్ప మాలధారణ భక్తులకు ఆలయ ప్రాంగణంలో సేవ చేసేందుకు 50 మందికి ఉపాధి కల్పించి ఇక్కడ రెండో శబరిమలను తలపించే విధంగా పూజలు నిర్వహించడం విశేషం. కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి సన్నిధిలో పూజలు చేసిన వారికి మంచి జరుగుతుందనే ఇక్కడి ప్రజల నమ్మకం.

31 వరకు వేడుకలు

అయ్యప్ప స్వామి ఆలయం 33వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు నేతృత్వంలో ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి కరకమలములచే ఈ నెల 31 వరకు వార్షికోత్సవ పూజలు అత్యం త వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజు వివిధ పూజలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

దివ్యాంగుల పాఠశాల ప్రారంభం



మోతీనగర్: బబ్బుగూడలో మాదినేని కల్యాణి, క్రాంతికుమార్ ఏర్పాటు చేసిన గనమాస్ దివ్యాంగుల పాఠశాలను శనివారం కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ప్రారంభించారు. దివ్యాంగుల కోసం పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బబ్బుగూడ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, డాకయ్య, రమేష్‌నాయర్, శ్రీధర్, ఎర్ర స్వామి, శోభ రాజన్, శ్రీనివాస్, హేమలత, వెంకట్, కాలనీ పెద్దలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.